క్లుప్తంగా

గొల్లగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రత్యూష్

ఎటపాక: మండలంలోని కన్నాయిగూడెం పంచాయతీ గొల్లగూడెంలో మంగళవారం నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి ప్రత్యూష్ ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్వే సూపర్‌వైజర్ సీతమ్మ,సిబ్బంది దుర్గారావు,లక్ష్మి,వరలక్ష్మి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ వినోద్

అరకులోయ రూరల్: ఇటీవల మృతి చెందిన డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ కిల్లోగూడకు చెందిన కిల్లో గున్నమ్మ కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకం కింద మంజూరైన బీమా మొత్తానికి సంబంధించిన రూ.2 లక్షల చెక్కును అరకులోయ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ వినోద్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గున్నమ్మ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఖాతాదారురాలని చెప్పారు. బీమా చెక్కు అందజేయడంతో గున్నమ్మ కుటుంబ సభ్యులు బ్యాంక్ మేనేజర్ వినోద్, క్యాషియర్ సతీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడమ్మ,ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, వలంటీర్ పార్వతి, వెలుగు వీవో చిరంజీవి పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు స్వాధీనం



అడ్డతీగల వారపు సంతలో పాలథిన్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మహిళా పోలీసులు

అడ్డతీగల: స్థానికంగా మంగళవారం జరిగిన వారపు సంతలో దుకాణదారుల నుంచి వేలాది పాలిథిన్ కవర్లను గ్రామ వలంటీర్లు, మహిళా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించడంతో వీటిని స్వాధీనం చేసుకున్నారు. వస్త్ర సంచులను వినియోగించాలని ప్రచారం చేశారు.

వైద్యులు లేక రోగుల ఇక్కట్లు

రాజవొమ్మంగి: స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. ఇక్కడి ఇద్దరు వైద్యులు సెలవుపై వెళ్లినట్టు సమాచారం. మంగళవారం ఒక పాయిజన్ కేసుతో పాటు, అత్యవసర చికిత్స అవసరమైన మరో రోగికి కూడా సకాలంలో వైద్యం అందక ఇబ్బంది పడ్డారు. దీంతో రోగుల వెంట వచ్చిన వారు ఈ విషయాన్ని స్థానిక ఎంపీడీవో యాదగిరీశ్వరరావు దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించారు. జడ్డంగిలో గల ఇద్దరు వైద్యుల్లో ఒకరికి రాజవొమ్మంగి పీహెచ్‌సీలో విధులు అప్పగించారు.

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లిరూరల్: డ్రాపవుట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు. మండలంలో పెదబరడ పంచాయతీ పరిధిలో ఉన్న పలువురు డ్రాప్‌అవుట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు మానేడం వల్ల పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. విద్యార్థులు వారికి నచ్చిన పాఠశాలలో చేరే అవకాశం ఉందని చెప్పారు. ఎనిమిది మంది డ్రాప్ అవుట్ విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వనపల ప్రసాద్,కార్యదర్శి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణమ్య శిరసా దేవం.. గౌరీ పుత్రం వినాయకం

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇళ్లలో, వీధుల్లో ప్రత్యేక మండపాలు వేసి గణనాథునికి పూజలు చేశారు. పలు చోట్ల పోటాపోటీగా మండపాలు, భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు.వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక రోజు పూజలు జరిపి థింసా నృత్యాలు, మేళతాళాలతో విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు.చాలా గ్రామాల్లో అన్నసంతర్పణలు జరిపారు.

- ఘనంగా వినాయ చవితి ఉత్సవాలు
- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- పోటాపోటీగా విగ్రహాల ఏర్పాటు



ముంచంగిపుట్టు మండలం సంగంసరియాలో ఏర్పాటు చేసిన 11 అడుగుల గణనాథుడు



పెదబయలు సి కాలనీలో వినాయక మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



జి.మాడుగులలో పూజ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్



రాజవొమ్మంగి వాల్మీకి నగర్‌లో పూజ చేస్తున్న చిన్నారులు



దుంబ్రిగుడలో ...



జి.మాడుగులలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు



జీకే వీధిలో ..



వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రాజేంద్రపాలెం వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గన్నవరంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



ముంచంగిపుట్టులో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర,మూర్తి దంపతులు



పవనగిరి క్షేత్రంలోని గిరిదుర్గా భవానీ ఆలయంలో వినాయకుని పూజలు చేస్తున్న భక్తులు



హుకుంపేటలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకు వెళుతున్న గిరిజనులు



చింతపల్లిలో గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు: మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన 8 అడుగుల గణనాథుడిని, సంగం సరియా గ్రామంలో ఏర్పాటు చేసిన 11 అడుగుల వినాయకుడిని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర,ఆమె భర్త నరసింహమూర్తి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారుమెట్ట, రంగన్నకొండ,కించాయిపుట్టు,కొత్తసుజనకోటగ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. రంగన్నకొండ, కించాయిపుట్టు గ్రామాల్లో వినాయక విగ్రహాలను సాయంత్రం థింసా నృత్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీత మ్మ,సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీనేతలు జయదేవ్,రాంప్రసాద్,పెదబా బు, రామ్మూర్తి, సురేష్, రఘునాథ, దామోదరం పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంతో పాటు 18 పంచాయతీల్లో వినాయకచవితి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నసంతర్పణ జరిపారు.

కొయ్యూరు: వినాయక చవితి ఉత్సవాలను అన్ని చోట్ల ఘనంగా నిర్వహించారు. రాజేంద్రపాలెం ,కొయ్యూరుతో పాటు పలు గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేశారు.

చింతపల్లిరూరల్: వినాయక చవితి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో మండలపాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మండల కేంద్రంలో మంగళవారం అన్నసమారాధన జరిపారు.

ఎటపాక: గణపతినవరాత్రి ఉత్సవాలు మండలంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గన్నవరంలో విక్రమార్క యూత్ ఆధ్వర్యంలో గణనాథుడిని ఏర్పాటు చేశారు. గౌరీదేవిపేట, గన్నేరుకొయ్యపాడు, నందిగామ, తోటపల్లి,గుండాల తదితర గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివాసీ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు.

గంగవరం: మండలంలో ఘనంగా గణనాథుని ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన గంగవరం రామాలయంలో గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పూజలు జరిపారు. స్థానిక సెంటర్ రామాలయంలో గంగవరం యువసేన యువకుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పెదగార్లపాడు, కొత్తాడ, నెల్లిపూడి, మోహనాపురం, జడేరు, మొల్లేరు గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు.

రాజవొమ్మంగి: మండలంలో వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చవితి తిథి సోమవారం, మంగళవారం కూడా ఉండడతో భక్తులు ఈ రెండు రోజుల్లోను వినాయక పూజలు నిర్వహించారు. రాజవొమ్మంగిలో 99 క్వార్టర్స్, కమ్మరిపేట, షిరిడీసాయి నగర్, నూకాలమ్మ గుడి వీధి, శ్రీరాంనగర్, విద్యానగర్, బీసీ కాలనీ, అప్పలరాజుపేటలలో గణేశ్‌మండపాలు ఏర్పాటు చేశారు. స్థానిక వాల్మీకి నగర్‌లో చిన్నారులు గణపతిని ప్రతిష్ఠించి ఉత్సవాలు జరిపారు.

అడ్డతీగల: మండలంలోని పవనగిరి క్షేత్రంలో పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య,విజయలక్ష్మి దంపతులు చవితి పురస్కరించుకుని వినాయకునికి భక్తులచే పూజలు చేయించారు. లక్ష్మీగణపతి ఆలయంలో మోటార్ యూనియన్ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

హుకుంపేట: మండలంలో వాడవాడలా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పూజల అనంతరం థింసా నృత్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

జి.మాడుగుల: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం ఆవరణలో కళామందిరం వద్ద, పాత ఎమ్మార్వో కార్యాలయం వీధిలోను, బస్‌స్టేషన్ వద్ద, జీఎం కొత్తూరులో ఉత్సవాలు ఘనంగా జరిగాయి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పోలీసు సిబ్బంది భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక రామాలయం ఆవరణలో సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, వంజరి, గెమ్మెలి, సొలభం, వంతాల, పెదలోచలి తదితర పంచాయతీల్లో అన్నసమారాధన నిర్వహించారు.

పెదబయలు: మండలంలో మూడు అడుగుల నుంచి 10 అడుగుల ఎత్తు వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు. పెదబయలు సి కాలనీ, పెదబయలు కూడలిలో విగ్రహాలు ఏర్పాటు చేశారు. సీతగుంట, రోగులపేట, అరడకోట, గలగండ, గంపరాయి,పెదకోడాపల్లి, కిముడుపల్లి, గోమంగి, బొండాపల్లి, గుల్లేలు, లింగేటి, బొంగరం, రూడకోట, కొరవంగి, పర్రెడ, వనభంగి, సీకరి పంచాయతీల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో గూడెం,పెదవలస,ఆర్వీ నగర్,రింతాడతోపాటు పలు గ్రామాల్లో వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మారేడుమిల్లి : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బలుసుమిల్లి వెంకట్రావు (చంటి) ఆధ్వర్యంలో స్థానిక వినాయక ఆలయ వద్ద గణపతి విగ్రహాన్ని నెలకొల్పారు. గ్రామానికి చెందిన భక్తులు బలరాం, దుర్గాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మిర్చి రైతులకు గోదావరి వరద ముప్పు



భద్రాచలం వద్ద నిండుగా ప్రవహిస్తున్న గోదావరి



నెల్లిపాక వాగు సమీపంలో మునిగిన మిర్చి మొక్కలు

- నీట మునిగిన పొలాలు
- ఆందోళనలో రైతన్నలు

ఎటపాక: మిర్చి రైతులకు గోదావరి వరద ముప్పు పొంచిఉంది. నిండు కుండలా గోదావరి మారడంతో మంగళవారం ఉదయం పలు లోతట్టు ప్రాంతాల్లోని పొలాలు నీట మునిగాయి. భద్రాచలం వద్ద మంగళవారం మధ్యాహ్నం 36.8 అడుగులకు నీరు చేరుకుంది. సాయంత్రం 4గంటలకు 4అంగుళాలు నీరు తగ్గి నిలకడగా ఉంది. రాయనపేట,నెల్లిపాక,తోటపల్లి, నందిగామ, మురుమూరు వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో నెల్లిపాక,నందిగామ,తోటపల్లి వాగుల పరీవాహక ప్రాంతాల్లో ఉన్న మిరప చేలన్నీ వరద ముంపునకు గురయ్యాయి. గోదావరికి వరద మరింత పెరిగే సంకేతాలు రావడంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువన ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతుండడం, ఇటు తాలిపేరు ప్రాజెక్టు నుంచి నీటిని గోదావరిలోకి విడుదల చేస్తుండడంతో రైతులు కంటిమీద కునుకులేకుండా గడుపుతున్నారు. ఇప్పటికే మిర్చి సాగుకు వేల రూపాయలు పెట్టుబడు పెట్టి ఉన్నారు. గోదావరి వరద ముంపునకు గురైన మిర్చి మొక్కలు పనికిరాకుండా పోతాయని మళ్లీ సాగు చేసుకునేందుకు మిర్చి నారు కూడా దొరకదని రైతులు దిగులు చెందుతున్నారు. గోదావరి నీటి మట్టం 40 అడుగులు దాటితే ఈప్రాంత రైతులకు కోలుకోలేని నష్టం జరుగుతుంది.

పార్టీలకతీతంగా మమేకం కావాలి

కన్వీనర్లు, గృహసారథులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దిశానిర్దేశం



కార్యక్రమానికి హాజరైన కన్వీనర్లు, గృహసారథులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులదే కీలక పాత్ర అని, గ్రామాల్లో అందరికీ సేవలందిస్తున్నట్టే పార్టీలకతీతంగా అందరితో మమేకం కావాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళవారం గర్నికంలో వారితో ప్రత్యేక సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందాయో లేదో తెలుసుకుని ఏమైనా అవసరమైతే, వాటిని అందించేందుకు కృషి చేయాలన్నారు. అందరితో మమేకమయ్యేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి జ్ఞప్తికి ఉంచుకోవాలన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చేసిన అవినీతి, ఆయన ముఖ్యమంత్రిగా చేసిన 13 సంతకాలు, ఐటీ, ఈడీ ఏవిధంగా దర్యాప్తు చేస్తుందో అందరికీ అర్థమయ్యేలా వివరించాలన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సెంట్రల్ జైల్‌లో ములాఖత్, ఆపై మిలాఖత్ ఏ విధంగా అయ్యారో వివరించాలన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న బీఎన్‌రోడ్డు డిసెంబర్‌లోగా పూర్తవుతుందని వివరించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు పాల్గొన్నారు.

800 మంది రైతులకు పాసుపుస్తకాల పంపిణీ

మాడుగుల రూరల్: వంటర్లపాలెంలో మంగళవారం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంలో భాగంగా 800 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరైనట్లు సర్పంచ్ అల్లాడ నాగేశ్వరరావు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ మృతికి సంతాపం



జయంతి (ఫైల్)

మారేడుమిల్లి : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలురు కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జయంతి సోమవారం అనారోగ్యంతో రంపచోడవరంలో ఇంటి వద్ద మృతి చెందారు. ఆమె మృతి పట్ల నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు సూర్యారావు, జిల్లా సెక్రటరీ త్రిమూర్తులు, కళాశాలసిబ్బంది మనోహర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజన్న దొర, మధు, బుల్లబ్బాయి సంతాపం తెలిపారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన

గొలుగొండ: జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.జె.ఎల్ ప్రసాద్ ఆధ్వర్యంలో పాకలపాడులో ప్రచారం నిర్వహించారు.

సచివాలయాలు, పీహెచ్‌సీ సందర్శన



లాగరాయి పీహెచ్‌సీలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర, లాగరాయి, లబ్బర్తి గ్రామాల్లో పలు కార్యాలయాలను స్థానిక ఎంపీడీవో యాదగిరీశ్వరరావు మంగళవారం సందర్శించారు. కింద్రలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించి, గ్రామ సచివాలయాలను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సిబ్బందితో చర్చించారు. అర్జీలు పెండింగ్ లేకుండా వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. లాగరాయి పీహెచ్‌సీకి వెళ్లిన ఆయన రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం జ్వరాలు అధికంగా ప్రబలుతున్నందున రోగులకు తగిన వైద్యసేవలందజేయాలని వైద్య సిబ్బందిని కోరారు.

విద్యార్థి మృతిపై పీవో విచారణ నిర్వహించాలి

కొయ్యూరు: యూ.చీడిపాలెంలో అనారోగ్యంతో నాల్గో తరగతి విద్యార్థి మృతి చెందడంపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, డీడీ కొండలరావు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు, సీఐటీయూ నాయకుడు వై.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి మరణించాడని ఆరోపించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో త్రినాథరావు

అరకులోయ రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో వి.త్రినాథరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను ఎంఈవో త్రినాథరావు, ఎస్‌జీఎఫ్ఐ సెక్రెటరీ పాంగి సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 నుంచి 17 సంవత్సరాలలోపు బాలబాలికలకు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. ఇక్కడ ఎంపికైన వారిని విశాఖపట్నం కణితి జెడ్పీ హైస్కూల్‌లో 20వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు దయానిధి,వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ భూపతిరాజు, పీడీలు కొండబాబు, సద్దు,బాలి,బాలకృష్ణ, చిన్నిబాబు,చందు,రాధాకృష్ణ పాల్గొన్నారు.

సమ్మెదలో 60 మందికి వైద్య పరీక్షలు

- ఐదుగురికి విషజ్వర లక్షణాలు

దేవరాపల్లి: సర్పంచ్ దొమ్మంగి బోడమ్మ ఆధ్వర్యంలో చింతలపూడి సచివాలయం పరిధి సమ్మెద గిరిజన గ్రామంలో దేవరాపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి–2 ఇ.పూజ్య మేఘన 60 మంది రోగులను పరీక్షించారు. వీరిలో ఐదుగురికి విషజ్వరాలు ఉన్నట్టు గుర్తించి రక్త పూతలను సేకరించారు. బీపీ, సుగర్ వ్యాధి గ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం జ్వరాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, హెల్త్ అసిస్టెంట్ సిహెచ్. కృష్ణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.